కోర్టు తీరుపై కెవిపిఎస్ హర్షం

ప్రజాశక్తి- గంగవరం: 2018లో నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన దళిత సామాజిక వర్గానికి చెందిన పెరుమాళ్ల ప్రణయ్ కులదురహంకార హత్యకేసులో నిందితులకు నల్గొండ జిల్లా ఎస్సీఎస్టీ కోర్టు సోమవారం తీర్పు వెల్లడించిందని, కోర్టు తీర్పుపై కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) హర్షం వ్యక్తం చేస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నూరు ఈశ్వర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ కులదురహంకార హత్య కేసుకు సంబంధించిన 8మందిలో ఏ 1మారుతీ రావు అమృతా తండ్రి ఆత్మహత్య చేసుకున్నారని, బతికి ఉంటే అతనికి కూడా ఉరి శిక్ష పడేదని అన్నారు. ఏ 2గా ఉన్న సుభాష్ శర్మకు ఉరి మిగిలిన ఆరుగురికి కోర్టు జీవిత ఖైదు విధించిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పు కులదురహంకార ఉన్మాదులకు హెచ్చరిక లాంటిదని అన్నారు. కులనిర్మూలనా జరగాలంటే ప్రభుత్వం కులాంతర వివాహాలను ప్రోత్సాహించాలని అన్నారు.

నూనె గింజల సాగుకు ప్రణాళికలు

సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- యాదమరి (చిత్తూరు)
జిల్లాలో విస్తీర్ణం, ఉత్పత్తి దిగుబడి లక్ష్యాల ఆధారంగా నూనె గింజల సాగుకు ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఆయిల్ సీడ్ మెషీన్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నూనెగింజల సాగుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించడంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా క్షేత్రస్థాయిలో ఎఫ్‌పిఒలు భాగస్వామ్యంతో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు, రైతుల ఆసక్తి ప్రభుత్వం ద్వారా వారికి అందించే సహాయ సహకారాలు సంబంధిత విషయాలపై అవగాహన పెంచి సమగ్ర నివేదికను తయారు చేయాలన్నారు. నూనె గింజలసాగుకు అవసరమైన విత్తనాల పంపిణీ, రైతులకు శిక్షణ, క్లస్టర్ ఫ్రంట్‌లైన్ ప్రదర్శనల పర్యవేక్షణ, పంట బీమా, సూక్ష్మ నీటిపారుదల, వ్యవసాయ రుణం సంబంధిత అంశాలపై చర్చించాలన్నారు. ప్రస్తుతం నూనెగింజల పంటలో భాగంగా మొదటి స్థానంలో వేరుశెనగ ఉండగా, తరువాత నీసం, పొద్దు తిరుగుడు గింజల సాగు, ఆయిల్ సీడ్ కలవని వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, వ్యవసాయ శాఖ ఎడి సావిత్రి, నాబార్డ్ డిడిఎం సునీల్, డిటిఒ రామచంద్ర, శాస్త్రవేత్త సంధ్య, ఎడిహెచ్ కోటేశ్వర రావు, ఎడిఎ విజయశంకర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమాలను అడ్డుకుంటే ఊరుకోం..

తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల ధర్నా

చిత్తూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉద్యమాలను అడ్డుకుంటే ఊరుకోమని సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్టియు నేతలు హెచ్చరించారు. అంగన్వాడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆదివారం చలో విజయవాడకు బయలుదేరిన అంగన్వాడీలను అరెస్టులు చేయడం, నిర్బంధించడం విజయవాడకు వెళ్లకుండా అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంచివరం సురేంద్రన్, యూనియన్ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గత ఎన్నికల సందర్భంగా ఎన్నో హామీలను ఇచ్చారని, అంగన్వాడీల సమ్మె సందర్భంలో తాము ప్రభుత్వంలోకి వస్తే జీతాలు పెంచుతామని , అంగన్వాడీలకు న్యాయం చేస్తామని గొప్పగా హామీలు ఇచ్చి, నేడు ఆ హామీలను అమలు చేయమని అడిగేందుకు చలో విజయవాడ బయలుదేరిన అంగన్వాడీలను నిర్బంధించడం, అరెస్టులు చేయడం న్యాయమా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే మరోమారు రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీల ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ఇలా అనేక రకాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకునే వెళ్లడానికి చలో విజయవాడ కార్యక్రమం పెట్టుకుంటే అరెస్టులు చేసి ప్రజాస్వామ్యాన్ని నవ్వుల పాలయ్యేలాగా చేస్తున్నారని విమర్శించారు. అంగన్వాడీ యూనియన్ సిఐటియు నాయకురాలు ఓహెచ్ సుజిని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు నాగరాజన్, రమాదేవి, దాసరి చంద్ర, మనీ, అనిత, జయంతి తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీ కార్యకర్తల అరెస్టు తగదు

కార్వేటినగరం: అంగన్వాడీ కార్యకర్తలను అరెస్టు చేసి నిర్బందించడం అధికార ప్రభుత్వానికి తగదని కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు విజయ అన్నారు. అంగన్వాడీ కార్యకర్తల డిమాండ్లను పరిష్కరించాలని సోమవారం ఐసీడీఎస్ కార్యాలయం నుంచి మండల కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు చెంచులక్ష్మి, రెడ్డెమ్మ, దేశమ్మ, హేమ, లక్ష్మీ నరసమ్మ, పద్మ, ఉమారాణి, సుగుణ, నాగమ్మ పలువురు పాల్గొన్నారు.

విన్నపాలు వినవలె

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 167 అర్జీలు

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

వేగంగా ఫిర్యాదులు పరిష్కరించాలి

చిత్తూరు అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలు ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, నేరుగా ఎస్‌పి, చిత్తూరు జిల్లా డిటిసి డీఎస్పీ జె.రాంబాబుని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యమని ఎస్‌పి అన్నారు. కార్యక్రమంలో మొత్తం 41 ఫిర్యాదులు అందాయి, చీటింగ్ 4, కుటుంబ తగాదాలు 5, ఇంటి తగాదాలు 5, భర్త వేదింపులు 5, భూ తగాదాలు 14, డబ్బు తగాదాలు 6, ఆస్తి తగాదాలు 2. ఉన్నాయి.

సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

త్వరితగతిన వినతులు పరిష్కారం

చిత్తూరు అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందే వినతులు, ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి నగర ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు అందించిన వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక సమర్పించాలన్నారు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఇంజనీరింగ్ 8, పబ్లిక్ హెల్త్ 2, టౌన్ ప్లానింగ్ 2, రెవెన్యూ 1 చొప్పున మొత్తం 11 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకట రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న నగర కమిషనర్

ప్రతి సమస్యా పరిష్కారం కావాలి..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి బాధ్యతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డిఆర్ఓ మోహన్ కుమార్, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు అనుపమ, విజయలక్ష్మి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి పని చేయాలన్నారు. ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని, ప్రతి అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందన్నారు. ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ-ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. మొత్తం 167 అర్జీల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి 112, పంచాయతీ రాజ్ 1, పోలీసు శాఖ 11, జిల్లా పంచాయతీ శాఖ 3, విద్యాశాఖ 1, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ 21, జిల్లా సహకార బ్యాంక్ 2, మునిసిపల్ కమిషనర్ చిత్తూరు 10, మునిసిపల్ కమిషనర్ పలమనేరు 1, ఎంపిడిఒ బంగారుపాళ్యం 1, ఎంపిడిఒ పెద్దపంజాణీ 1, ఎంపిడిఒ సదుం 1, గృహనిర్మాణ సంస్థ 2 అర్జీలు అందాయి.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

సిఎంను కలిసి విన్నవించిన ఎమ్మెల్యే అమర్
ప్రజాశక్తి-పలమనేరు:
పలమనేరు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని స్థానిక శాసనసభ్యులు అమరనాథ రెడ్డి సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలసి విన్నవించారు. శాసనసభ సమావేశాలకు హాజరైన ఆయన సమావేశానంతరం నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోరుతూ సీఎంను తన కార్యాలయంలో ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో సాగు, తాగునీటి శాశ్వత పరిష్కారానికై గంగన్న శిరస్సు, కైగల్ ప్రాజెక్టుల ఏర్పాటు, రైతుల సౌకర్యార్థం మోడల్ మార్కెట్ యార్డ్ ఏర్పాటు, విద్యార్థుల కొరకు సంక్షేమ హాస్టళ్ళు, స్కూల్ భవనాలు, బైరెడ్డిపల్లిలో జామియా మసీద్, షాదీ మహాల్స్, వి.కోటలో కోల్డ్ స్టోరేజ్‌లతో పాటు కళాశాలల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. అదేవిధంగా ఎన్నికలకు ముందు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన గ్రామాలలోని స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు నిధులను కేటాయించి ఆదుకోవాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ అభివృద్ధి పూర్తిస్థాయిలో కుంటుపడిందని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులన్నింటినీ వైసిపి నేతలు అభివృద్ధి చేయకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని కనుక నియోజకవర్గ అభివృద్ధికి అన్నివిధాల నిధులను అందించి ఆదుకోవాలని ఆయన కోరారు. దీనిపై స్థానికులంగా స్పందించిన సీఎం పలమనేరు అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే దూళిపాల నరేంద్ర తదితరులు ఉన్నారు.



సిఎం చంద్రబాబు నాయుడుకి నియోజకవర్గ సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

మోడీ ప్రజల్ని పట్టించుకోలేదు..

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మోడీ ట్రంప్ గురించి, టైగర్ల గురించి ఆలోచిస్తున్నాడే గాని ప్రజల్ని పట్టించుకోలేదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ధ్వజమెత్తారు. సోమవారం గంగాధర నెల్లూరు ఎంపీడీవో ఆఫీస్ ఎదుట కాంగ్రెస్ కార్యకర్తలు కలిసి ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని, మాజీ సీఎం జగన్ రెడ్డి మాత్రం ఆర్థికంగా బాగా ఎదిగాడని విమర్శించారు. సీఎం చంద్రబాబు 14ఏళ్ళ పాటు సీఎంగా పనిచేసిన చిత్తూరు జిల్లాలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పీఎం మోడీ దేశ పేదరికం గురించి ఆలోచించడం లేదని, పెరిగిన ట్యాక్స్‌లు గురించి ఆలోచించడం లేదు, నిత్యావసర వస్తువులు అమాంతంగా పెరిగిన పట్టించుకోవడం లేదని విమర్శించారు. సీఎం చంద్రబాబు ఆడవాళ్ళకి ఆర్టీసీ బస్సు ప్రయాణం ఫ్రీ అన్నాడని, రైతుబంధు, మహిళలకు 1500 ఆ పథకాలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ పేరుతో మోసం చేస్తూ కాంగ్రెస్ పార్టీ పెట్టిన ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ కూడా గత వైసీపీ ప్రభుత్వం మూయించారని ఈప్రభుత్వం కూడా ఆబాటలోనే నడుస్తుందన్నారు. ప్రజావేదిక పేరిట చంద్రబాబు గంగాధర నెల్లూరు పర్యటనలో ఏదైనా ఒక పెద్ద పరిశ్రమకు శంకుస్థాపన చేసి ఉంటే బాగుండేదన్నారు.

మంగళ విద్యావాణి సంచికను ఆవిష్కరించిన జెసి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే నిర్వహిస్తున్న మాసపత్రిక మంగళ విద్యావాణి 34వ సంచికను సోమవారం చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో విద్యాధరి ఆవిష్కరించారు. ఈ మాసపత్రిక సైన్స్‌కు సంబంధించి ప్రత్యేక సంచికగా విడుదల చేస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి జెసికి వివరించారు. జెసి మంగళ విద్యావాణి 34వ సంచికను పరిశీలించి పాఠశాలలో ఇలాంటి మాసపత్రికను నిర్వహిస్తూ విద్యార్థులతో రచనలు చేయడం మంచి పరిణామమని పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాలలో మౌలిక వసతులు గురించి తెలుసుకొని పాఠశాలకు రూ.15వేల పుస్తకాలను అందజేస్తానని తెలిపారు. మాసపత్రిక సంపాదకులు గణిత అవధాని జన విజ్ఞానవేదిక జిల్లా ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు హెచ్.అరుణ శివప్రసాద్ మాట్లాడుతూ ఈ సంచికలో ఎక్స్ కిరణాల గురించి ఆవర్తన పట్టికకు ఆద్యుడు మెండలీఫ్, గెలీలియో, సివి రామన్ల గురించి, సైన్స్ ఆవిష్కరణల గురించి ప్రత్యేక సంచికగా 34వ సంచికను విడుదల చేశామని తెలిపారు. ఈ సంచికకు దాతగా నలగంపల్లికి చెందిన పారిశ్రామికవేత్త ధరణి ప్రసాద్ వ్యవహరించారు. పాఠశాల ఉపాధ్యాయులు భారతి, సంపంగి పాల్గొన్నారు.

వేలం పాట ద్వారా రూ.2.95 కోట్లు ఆదాయం

ప్రజాశక్తి- చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ దేవస్థానంకు వివిధ వనరుల ద్వారా రూ 2,95,15,000లు ఆదాయంగా సమకూరినట్లు ఆలయ ఈవో, ఉపకమిషనర్ ఏకాంబరం తెలిపారు. సోమవారం సంవత్సర కాలపరిమితితో కొండపై నిర్వహించిన వేలంపాటలో కొండపైన కొబ్బరికాయలు పూజా సామగ్రి విక్రయించుకునే హక్కును రూ.52.50లక్షలతో శివకుమార్ హెచ్చుగా పాడి దక్కించుకున్నారన్నారు. కొండపై పూలహారాలు, నిమ్మకాయ హారాలు, వడివాల సామగ్రి, చీరలు జాకెట్ పీసులు విక్రయించుకునే హక్కును గణపతి రూ.42 లక్షలు, దేవస్థానం పంచాయతీకి చెందిన టోల్గేట్ నిర్వహించుకుని హక్కును రూ.68.50లక్షలు, పెద్ద భోగం, చిన్న భోగం సేకరించుకుని వేలంపాట నిర్వహించుకునే హక్కును రూ.82.15లక్షలతో వెంకటరమణ దక్కించుకున్నారన్నారు. అదేవిధంగా భక్తులు సమర్పించు చీరలు, రవికలు, పావడ ఆఫీసులో సేకరించిన హక్కును గంగులప్ప రూ.46.50 లక్షలను హెచ్చుగా పాడి దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ శశి కుమార్, సర్పంచ్ సోనీ, ఆలయ అధికారులు, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

కంచెను తొలగించి ఇళ్ల స్థలాలను ఇప్పించండి..

ప్రజాశక్తి- కార్వేటినగరం: కంచెను తొలగించి ప్రభుత్వం ఎస్టీలకు అందించిన ఇళ్ల స్థలాలను అప్పగించాలని కార్వేటినగరంలోని కాశాతోట వీధికి చెందిన ఎస్టీ కాలనీవాసులు సోమవారం మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1989 సంవత్సరంలో కాశాతోట వీధిలో నివాసం ఉంటున్న ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన 25 మందికి సర్వే నెంబర్ 938/1, 338/3లో ప్రభుత్వం ఇంటి స్థలాలను మంజూరు చేసిందని, అయితే సమీపంలో ఉన్న ఓ రైతు పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలతో పాటు కాలువ పరంబోకు, అదే విధంగా కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన భూమి, ప్రభుత్వభూమిని కలిపి ఆక్రమించుకుని పెంచింగ్ వేశారని తెలిపారు. అలాగే కోట చెరవుకు వెళ్లే కలుజు కాల్వను కూడా ఆక్రమించుకున్నట్లు వివరించారు. తహసీల్దార్ స్పందించి పేదలకు పంపిణీ చేసిన ఇంటి స్థలంతో పాటు ఆలయ భూమి, ప్రభుత్వ భూమిని కాపాడుకోవాలని కోరారు. అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా ఇదే సర్వే నెంబర్లో ప్రైవేటు సెల్ టవర్ను నిర్మాణం చేసి ప్రతినెలా బాడుగ అందుకుంటున్నాడని, సెల్ టవర్ నివాశాలకు కూతవేటులో ఉన్నందున ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందోనని భయభ్రాంతులకు గురవుతున్నట్లు వెల్లడించారు.

13న వారపు సంత వేలం

ప్రజాశక్తి- రొంపిచర్ల: రొంపిచర్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో 13వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు వారపు సంతకు వేలం నిర్వహిస్తున్నట్లు గ్రామపంచాయతీ సర్పంచ్ ఆర్ ఇబ్రహీం ఖాన్ తెలిపారు. వారపు సంతకు ధరావతు సొమ్ము రూ.2లక్షలు, రోజువారి దినసరి మార్కెట్‌కు రూ.80వేలు, ప్రైవేటు బస్టాండ్ రూ.80 వేలు, పంచాయతీ కార్యదర్శి వద్ద డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చునని తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు గ్రామపంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండరాదని తెలిపారు.

గజవాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు

ప్రజాశక్తి- సోమల: మండలంలోని ఆవులపల్లి గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి గజ వాహనంపై అధిష్ఠించి పురవీధులలో ఊరేగారు. ఉదయం మూల విరాట్‌కు ఉత్సవ విగ్రహాలకు అభిషేకం నిర్వహించి ప్రాతఃకాల సేవలను అందజేశారు. సాయంత్రం మోహిని అవతారంలో స్వామివారికి ఉత్సవాన్ని నిర్వహించారు. ఆపై గజవాహనంపై ఉత్సవమూర్తులను ఆసీనులు చేసి రంగురంగుల పుష్పాలతో అలంకరించి పురవీధులలో ఊరేగించారు. భక్తులు మంగళహారతులతో శ్రీవారికి స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు గరుడ వాహన సేవ

ఆవుల పల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నేడు మంగళవారం స్వామివారికి కళ్యాణ మహోత్సవం అనంతరం గరుడ వాహనంపై వాహనసేవ నిర్వహించనున్నట్లు టిటిడి నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం అశేష భక్తజనావని తిలకిస్తుండగా స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు.

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు 18 అర్జీలు

తహశీల్దార్ లోకనాథ పిళ్ళై

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మండలంలోని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ లోకనాథ పిలై తెలిపారు. సోమవారం తహశీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమంలో మొత్తం18 అర్జీలు అందాయని, అందులో 12 సమస్యలు పట్టాదారు పాసుపుస్తకం వెబ్ ఆన్లైన్ సంభందించి, 4 ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ కొరకు, 2 దారి తగాదాలు సమస్యలపై వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. అందులో 5 సమస్యలు అక్కడే పరిష్కారించగా మిగిలిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు.

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలో బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇవ్వబడునని సోమవారం ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి 600 యూనిట్లు మంజూరయ్యిందని, బీసీ కార్పొరేషన్ ద్వారా కులాల వారి ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. బిసి 250 యూనిట్లు, కమ్మ 90 యూనిట్లు, రెడ్డి 65 యూనిట్లు, ఆర్యవైశ్య 14 యూనిట్లు, బ్రాహ్మణ 15 యూనిట్లు, క్షత్రియ 11 యూనిట్లు, ఇబీసీ 100, కాపు 55 మహిళలకు టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నారు. ఇందుకు వయసు 18 నుండి 50 సంవత్సరాల లోపు మహిళలు అర్హులన్నారు. 75 శాతం హాజరుతో శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి టైలరింగ్ మిషన్లు సరఫరా చేయబడునని ఎంపీడీవో హరి ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

శ్రీవేణుగోపాల స్వామికి కల్యాణోత్సవం

ప్రజాశక్తి- చౌడేపల్లి: శ్రీవేణుగోపాలస్వామి పునఃప్రతిష్ట, విమాన గోపుర కలశ ప్రతిష్ట, ఆలయ సంప్రోక్షణ, కుంబాభిషేక కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజున స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు కళ్యాణోత్సవం ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి కళ్యాణం, తదనంతరం గ్రామఉత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామి అమ్మవారు గరుడ వాహనంపై వీధుల్లో ఊరేగుతూ ఇంటింటి పూజలను అందుకున్నారు.

హనుమంత వాహనంపై లక్ష్మీ నరసింహస్వామి

ప్రజాశక్తి- రొంపిచర్ల: పులిచెర్ల మండలం దేవళంపేటలోని లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారిని హనుమంత వాహనంపై పురవీధులలో ఊరేగించారు. స్వామివారిని దర్శించుకొనుటకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఊరేగింపు సందర్భంగా కళాకారులు కోలాటాలు, చెక్కభజనలు నిర్వహించారు. అనంతరం భక్తులు అన్నదానం చేశారు.

సునీల్ కుమార్ సస్పెన్షన్ ఎత్తివేయాలి

బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు చందు

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : సీనియర్ ఐపిఎస్ అధికారి సునీల్ కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేయడం అక్రమమని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు చందు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా సునీల్ కుమార్ విదేశాలకు వెళ్లారనే కారణం చూపుతూ ఆయనను విధుల నుండి తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని దళిత సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఒక ఐపిఎస్ అధికారిని నియమ నిబంధనలకు వ్యతిరేకంగా సస్పెండ్ చేయడం రాజకీయ కక్ష సాధింపుగా తాము పరిగణిస్తున్నట్లు తెలిపారు. సస్పెండ్‌కు గురైన అధికారి తన విధి నిర్వహణలో ఇంతవరకు ఎలాంటి ఆరోపణలు లేకుండా విధులు నిర్వహించినట్టు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమత సైనిక్ దళ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గోవిందప్ప, బుర్ర సతీష్, వేలు, కుమార్, తిమ్మరాయప్ప, రాము, చౌడప్ప రంగనాథన్ పాల్గొన్నారు.

గ్లకోమా వారోత్సవాలు

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గ్లకోమా వారోత్సవాలపై గోడపత్రికలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆవిష్కరించారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్లకోమా అనేది కళ్లకు సంబంధించిన వ్యాధి అని, కంటి లోపల పీడనం పెరిగి కంటి నరాన్ని చచ్చుబడిపోయేటట్లు చేస్తుందని, తద్వారా నెమ్మదిగా కనుచూపు తగ్గిపోతుందని తెలిపారు. గ్లకోమా ప్రారంభదశలో ఎటువంటి లక్షణాలు కనబడక పోవచ్చునని, ఈ వారోత్సవాలలో భాగంగా ప్రతి ఒక్కరూ గ్లకోమా పరీక్ష తప్పక చేయించుకోవాలన్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి పరీక్షలు ఉచితంగా చేయబడునని ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, డిబిసిఎస్ డాక్టర్ అర్పిత, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త బుట్టలు పంపిణీ

ప్రజాశక్తి- చౌడేపల్లి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చునని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన చౌడేపల్లిలో ఆయన ఇంటింటికి చెత్తబుట్టలను అందించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతతో అంటువ్యాధులకు దూరంగా ఉండవచ్చు అన్నారు. ప్రతిరోజు ఇంటి నుంచి వచ్చే వ్యర్థాలను చెత్తబుట్టలో వేసి పంచాయతీ కార్మికులకు అందజేయాలన్నారు. అనంతరం పారిశుధ్యంపై అవగాహన కల్పించారు.

'యువత పోరు' జయప్రదం చేయండి

మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: యువత పోరును జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వైసిపి యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మండల కన్వీనర్ రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ పేదవాడు ఉన్నత చదువులకు దూరం కాకూడదని ఉద్దేశంతో వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ఫీజు రియంబర్స్మెంట్ చేపట్టిందని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత విద్యార్థులను గాలికివదిలి పేదవాడికి విద్య దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఈనెల 12న కలెక్టరేట్లను ముట్టడిచే కార్యక్రమాన్ని చేపడుతుందని ఈ కార్యక్రమానికి పూతలపట్టు నియోజకవర్గంలోని విద్యార్థులు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కుమార్‌రాజా, దత్తురెడ్డి, ప్రకాష్ రెడ్డి, పరదేశి కిషోర్ కుమార్ రెడ్డి, నాగరాజా, షాకీర్ పాల్గొన్నారు.

గజదాడుల నుంచి కాపాడండి..

కలెక్టర్, డీఎఫ్ఓకు రైతుల వినతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పంటలపై ఏనుగుల దాడులు నివారించేందుకు చర్యలు చేపట్టాలని మండలంలోని రాగిమాను పెంట, వెలుతురు చేను, కెఎంకండిగా పంచాయతీలలోని రైతులు సోమవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా అటవీశాఖ అధికారి భరణికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జిల్లా అధికారులకు ఏనుగులు నివారించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కలెక్టర్, డిఎఫ్ఓ స్పందిస్తూ అటవీ సముదాయాల్లో కందకాలు, సోలార్ పెంసింగ్ ఏర్పాటు చేయనున్నట్టు హామీ ఇచ్చినట్లు తెలిపారు. రైతులు నాగరాజు నాయుడు, రమేష్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పి4 పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్

పి 4 పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పేదరికాన్ని పూర్తిగా పోగొట్టే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమం (జీరో పావర్టి)ను ప్రభుత్వ, దాతల ప్రజల భాగస్వామ్యం (పి4)తో చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పి 4 కార్యక్రమాన్ని ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా సచివాలయంలోని ప్రజాసమస్యల పరిష్కార వేదిక సమావేశపు మందిరంలో పి4 పోస్టర్లను జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరితో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్ణాంధ్ర ప్రదేశ్-2024లో భాగంగా రాష్ట్రంలోని అత్యంత వెనుకబడ్డ 20శాతం కుటుంబాలకు సహాయం చేయడానికి, ప్రోత్సహించడానికి, ప్రగతి వైపు నడిపించేందుకు, వెనుకబడిన కుటుంబాలను ప్రత్యక్షంగా దత్తత తీసుకుని వారికి మార్గదర్శకం, ఆర్థిక సహాయం, ఉద్యోగ అవకాశాలను కల్పించే మార్గాలను ఏర్పాటు చేసి వారిని పేదరికం నుండి బయటకు తీసుకురావడానికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం కావాలని ఆహ్వానిస్తూ ప్రజల సూచనలను వెబ్ సైట్ పోస్టర్లలో కనబరిచిన క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా వారి అభిప్రాయాలను తెలపవచ్చని అన్నారు. మీ సలహాలను ప్రశంసిస్తు ప్రశంశాపత్రంను ఆన్‌లైన్ ద్వారా అందించబడుతుందని, ప్రజలు తమ విలువైన అభిప్రాయాలను మార్చి 9వ తేదీ నుండి 25వ తేదీ లోగా లింక్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేసి తెలుపవచ్చునన్నారు. ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డిఆర్ఓ కె.మోహన్ కుమార్, సిపిఓ సాంబ శివారెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుండి సోమవారం నిర్వహించే పరీక్ష ప్రశ్నాపత్రాలను బందోబస్తు నడుమ పరీక్ష కేంద్రానికి తీసుకువెళ్లారు. ఆయన మాట్లాడుతూ మాథ్స్, జువాలజీ, హిస్టరీ పరీక్ష నిర్వహించగా 127 మంది హాజరు కావాల్సి ఉండగా 97 మంది పరీక్షకు హాజరయ్యారని పది మంది విద్యార్థులు గైర్ హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అందరికీ డెస్కులు, తాగునీటి వసతి, వైద్యం, బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్నాపత్రాలను తీసుకు వెళుతున్న దృశ్యం

మహిళల ఆరోగ్యం దేశానికి శ్రేయస్కరం

ప్రజాశక్తి- కుప్పంరూరల్ : కుప్పం డిగ్రీ కళాశాల మహిళ సాధికార కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఎన్.కొత్తపల్లి గ్రామంలో మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ మాండవ హరిత, కళాశాల చైర్‌పర్సన్ శాంతా నాగరాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ బిసిఎన్ విద్యాసంస్థలు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతోపాటు మహిళా అభ్యున్నతికి సైతం సహకరిస్తుందని తెలిపారు. నవీన యుగంలో మహిళలు అన్ని రంగాలలో రాణించడం ఆనందంగా ఉందన్నారు. మహిళలు ముఖ్యంగా మహిళా ఆరోగ్యం దేశ ప్రగతికి శ్రేయస్కరమని, ప్రతి మహిళ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కళాశాల ఉపాధ్యక్షులు సాగర్ రాజు, ప్రిన్సిపల్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

యాదమరి: కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో సోమవారం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న 16 మంది మహిళ ఉపాధ్యాయులను, బోధనేత సిబ్బందిని సత్కారించి, సన్మానించినట్లు ప్రధానోపాధ్యాయులు లతిత తెలిపారు. ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను సత్కరిస్తున్నామని సీనియర్ ఉపాధ్యాయులు కనకాచారి, మదన్‌మోహన్ రెడ్డి తెలిపారు. అరుణ, సబిత, వాణి, జి.భారతి, ఉష, ఎం.భారతి, నీలవేణి, రాజరాజేశ్వరి, మంజు లత, మంజుశ్రీ, విష్ణుప్రియ, లీలారాణి, అక్తర్, షర్మిల, నదియాను సత్కారించడం జరిగిందని ఇన్‌చార్జి హెచ్ఎం భాస్కర్‌రెడ్డి తెలిపారు.

యాదమరి కాశిరాళ్ల పాఠశాలలో..

గర్భిణులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం పీఎం ఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు వైద్యపరీక్షలను నిర్వహించి సలహాలు సూచనలు అందజేసి మందులు మాత్రలను పంపిణీ చేశారు. వైద్యాధికారులు జయసింహ, ప్రదీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలకు చెందిన 55 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఆహార నియమాలు పాటించాలని పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ అమర్నాథ్ ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి వైద్యులు వినయ్ ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు ఆహార నియమాలు పాటిస్తూ పోషకాహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న వేసవి దృష్ట్యా కొబ్బరి నీళ్లు, మజ్జిగ, పండ్ల రసాలు తీసుకోవాలని, బయట తిరగకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్ విజయ చంద్ర, సిబ్బంది గర్భిణులకు నెలావరీ ఆరోగ్యపరీక్షలు నిర్వరహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మండల కేంద్రంలోని మహతి ఫౌండేషన ఛైర్మన్ నాగరాజు సహకారంతో వైద్యం కోసం వచ్చిన గర్భిణులకు ఉచితంగా పౌష్టికాహారం అందించారు. డాక్టర్ విజయ చంద్ర మాట్లాడుతూ పిహెచ్‌సిలో స్కానింగ్ సెంటర్ అందుబాటులో ఉందని, నెలవారీ రక్తపరీక్షలతోపాటు ఇకపై స్కానింగ్ సదుపాయం కూడా ఉందని గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి, మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్

స్వాధీనం చేసుకున్న గంజాయి చూపుతున్న సిఐ

8 కేజీల గంజాయి స్వాధీనం

వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలు ఆదేశాల మేరకు చిత్తూరు టౌన్ పరిసర ప్రాంతాలలో గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ ఆధ్వర్యంలో చిత్తూరు వన్ టౌన్ స్టేషన్ సీఐ జయరామయ్యకి అందిన ఖచ్చితమైన సమాచారం మేరకు సోమవారం స్థానిక మిట్టూరులోని పాడుపడిన పోలీసు గృహాలున్న ప్రదేశంలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా ఉండగా అతనిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి 8 కేజీల 125 గ్రాముల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణలో అతనిపేరు ఎస్.మణిగండ అని, స్వాధీనం చేసుకున్న గంజాయి ఇచ్చాపురం నుండి తెచ్చి చిత్తూరులో అమ్ముకోవడానికి ప్రయతిస్తున్నట్టు అంగీకరించాడు. దీంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు. స్వాధీనం చేసుకున్న వాటి విలువ సుమారు రూ.3లక్షలు ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే వారి పైన చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

బాలిక మిస్సింగ్ - కేసు నమోదు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: పాఠశాలకు వెళ్ళొస్తానని బయలుదేరి వెళ్లిన బాలిక కనబడక పోవడంతో తల్లిదండ్రులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ధర్మపురికి చెందిన బాలిక మూలతిమ్మేపల్లి పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. రోజులానే ఈనెల 6వ తేదీ గురువారం ఇంటి నుండి పాఠశాలకు బయలుదేరి వెళ్లింది. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో ఆమె తల్లిదండ్రులు నాలుగు రోజులుగా చుట్టుపక్కల గ్రామాల్లో బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో సోమవారం స్థానిక పోలీసుస్టేషన్లఓ ఎస్సై పరశురాముడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం- ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- తవణంపల్లి:

జోగువారి పల్లి, టీ పుత్తూరు హరిజనవాడలో సోమవారం అక్రమంగా మద్యంను ఎటువంటి లైసెన్స్ లేకుండా అమ్ముతున్న వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. జోగివారిపల్లి గ్రామానికి చెందిన సుఖేష్ అనే వ్యక్తి నుంచి 23 బాటిళ్ల మద్యం, పుత్తూరు హరిజనవాడ కిషోర్ అనే వ్యక్తి వద్ద 19 బాటల్స్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాటు తుపాకీ స్వాధీనం- వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం :

నాటు తుపాకీ స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు సిఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మండలంలోని వెలుతురుచేను పంచాయతీ పులిమడుగు గ్రామానికి చెందిన బాలకృష్ణ కుమారుడు కాశీ అడవి జంతువులను వేటాడడం కోసం నాటు తుపాకీ పెట్టుకుని ఉండగా అతన్ని అదుపులోకి తీసుకుని నాటు తుపాకీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

గుండె పోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు:

గంగాధర నెల్లూరు బాలుర సంక్షేమ వసతి గృహంలో వంట మనిషి (కుక్)గా పనిచేస్తున్న నందకుమార్ (45)రెగ్యులర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. సోమవారం గుండెల్లో నొప్పిగా ఉందని ఇంట్లో వాళ్ళకి తెలిపాడు కొద్దిసేపటికే నందకుమార్ మరణించారు. సమాచారం తెలుసుకుని ఎఎస్ డబ్ల్యూఓ షకీలా, హాస్టల్ వార్డెన్ నందకుమార్ భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

ఉపాధి కూలీల 'వేతన' వ్యథ

ప్రజాశక్తి - ఓజిలి: వామపక్షాల ఉద్యమ ఫలితంగా అమలవుతున్న ఉపాధి హామీ పథకం పాలకుల నిర్లక్ష్యం వల్ల అర్థాకలితోనే బతుకు జీవనం సాగించాల్సి వస్తోంది. గత రెండు నెలలుగా ఉపాధి పనులు చేసినా, వేతనాలు పడకపోవడంతో కూలీల ఆవేదన వర్ణనాతీతం. పల్లెల్లో కూలీల వలసలను నివారించడంతో పాటు వారికి పని కల్పించి చేసిన పనికి తగినట్లుగా వేతనాలు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా పాల్పడుతుంది. ఎంతో మంది పేద కుటుంబాలకు కడుపు నింపుతున్న ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నీరు గార్చే విధంగా ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. గ్రామాలలో వలసల నివారణకు ఉపాధి హామీ పథకం ఎంతగానో తోడ్పడుతుంది. ఉపాధి హామీ పనులను చేసుకుని కుటుంబాలను పోషించుకునే పేద మధ్యతరగతి కుటుంబాలకు గత రెండు నెలలుగా వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో నిరుపేద కుటుంబాలు అర్ధాకలితో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఓజిలి మండలంలోని 26 పంచాయతీల్లో సుమారు 9,134 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో పనులు నిర్వహించిన రెండువేల మంది ఉపాధి హామీ కూలీలకు సంబంధించి 56 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంది. పనులు నిర్వహించి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కూలి డబ్బులు చెల్లించలేదు. ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు వేతనాలు ఇవ్వడంలో పాలక ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఉపాధి కూలీలు ఆవేదన చెందుతున్నారు. దీనితో పాటు పని ప్రదేశంలో కనీసం వసతులు కల్పించకపోవడం వల్ల ఉపాధి కూలీలు

మండుటెండలోనే పనులు

పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. ఇటీవల ఎండలు తీవ్రంగా ఉండడంతో కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు. వేసవిలో మార్చి నుంచి జూన్ వరకు కూలీలకు వడదెబ్బ తగలకుండా నీడకోసం టెంట్లు వేసి రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపాధి హామీ మెటీరియల్ బకాయిలు ఏవి?

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ నిధులతో మెటీరియల్ కింద సుమారు మూడు కోట్ల రూపాయల వరకు మంజూరు చేశారు. ఇందులో పలు గ్రామాల్లో సిమెంట్ రహదారులు , మినీ గోకులాలు పనులు కూడా పూర్తయ్యాయి. పనులకు సంబంధించి బకాయిల నిధుల విడుదలలో జాప్యం జరుగుతుంది. వివిధ పనులు నిర్వహించిన వారు అపో సప్పో చేసి పనులను పూర్తి చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో మల్లగుల్లాలు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

పార్టీ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తా..

రాష్ట్ర వైసిపి మేధావుల ఫోరం కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి



ప్రజాశక్తి- పూతలపట్టు: అధిష్టానం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని నూతనంగా ఎంపికైన వైసిపి రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. ఈ పదవి రావడానికి సహకరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిల నమ్మకానికి కట్టుబడి పనిచేస్తానని సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. నాయకులు స్వగ్రామంలోని పూతలపట్టులో ఆయన్ను సాలువాలతో అభినందించారు.

మొదలియార్ కులసభ్యులను ఓబీసీగా గుర్తించండి

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కేంద్రంలో మొదలియార్ కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చడానికి సహకరించాలని కోరుతూ టిడిపి మొదలియార్ కులసాధికార సమితి కుప్పం నియోజకవర్గ అధ్యక్షులు మునిరత్నం కోరారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక కులసభ్యులతో కలిసి ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ మొదలియార్ కులాన్ని రాష్ట్ర ప్రభుత్వం బీసీ-డిగా గుర్తించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో తమ కులాన్ని వెనుకబడిన తరగతులలో చేర్చడం వల్ల కులసభ్యుల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం సైతం తమ కులసభ్యులను ఓబీసీలుగా గుర్తిస్తే దేశవ్యాప్తంగా ఉన్న తమ కులసభ్యుల అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడుతుందని, కావున ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, మొదలియా కులాన్ని ఓబిసి కులాల జాబితాలో చేర్చడానికి సహకరించాలని కోరినట్టు తెలిపారు. నియోజకవర్గ ఉపాధ్యక్షులు సూర్యప్రకాష్, కో ఆర్డినేటర్ చెక్కునత్తం మణి, బాలాజీ, ప్రభు, మంజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి వినతి పత్రాన్ని అందిస్తున్న నాయకులు

సావిత్రి బాయి పూలేకు నివాళి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సంఘ సంస్కర్త సావిత్రి భాయి పూలే 128వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఉదయం మహిళా యూనివర్సిటీ సమీపంలో బిసి సంఘర్షణ సమితి ఏర్పాటు చేసిన ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నివాళి అర్పించారు. ఆధునిక విద్య ద్వారానే మహిళల అభివద్ధి సాధ్యమని నమ్మి జీవితాంతం కషిచేసిన గొప్ప నాయకురాలు సావిత్రి భాయి పూలే ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, బిసి సంఘర్షణ సమితి అధ్యక్షులు అక్కినపల్లి లక్ష్మయ్య, సాకం ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ 45వ వర్ధంతి

ప్రజాశక్తి - తిరుపతి సిటి: శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులవారి సంకీర్తనలను రాగి రేకుల నుండి పరిష్కరించి గ్రంథస్తం చేయడంతోపాటు వందల కతులను స్వరపరిచిన సంగీత, సాహిత్య విద్వాంసులు శ్రీ రాళ్లపల్లి అనంతకష్ణశర్మ 46వ వర్ధంతి కార్యక్రమం మార్చి 11న మంగళవారం జరగనుంది. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూ ధార్మిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాల ప్రాగణంలోని శ్రీ రాళ్లపల్లి అనంతకష్ణశర్మ విగ్రహానికి పుష్పాంజలి సమర్పిస్తారు. అనంతరం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 10.30 గంటలకు సాహితీ సదస్సుతో కార్యక్రమం ప్రారంభం కానుంది.ఈ కార్యక్రమంలో శ్రీ అనంతకష్ణశర్మ మనవరాలు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆంగ్ల శాఖ విభాగాధిపతి ఆచార్య రాళ్లపల్లి దీప్త ప్రత్యేక అతిథిగా పాల్గొంటారు. రాళ్లపల్లి సాహిత్యంపై తిరుపతికి చెందిన శతావధానిఆముదాల మురళి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం అధ్యాపకులు డా.లక్ష్మీనారాయణ ప్రసంగిస్తారు.